నిర్లక్ష్యం వద్దు..సమన్వయంతో పనిచేద్దాం

- రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా
- కమిషనరేట్‌లో పోలీసు దర్బార్

మాట్లాడుతున్న సీపీ అంగర్ కిశోర్

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 19: విధుల్లో నిర్లక్ష్యం వీడాలని, అందరం సమన్వయంతో పనిచేద్దామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. బుధవారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో జరిగిన దర్బార్ కార్యక్రమంలో సీపీ పాల్గొని ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. వారి సమస్యలు, వినతులు అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలు దర్బార్‌లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చే నేరుగా కలిసి చెప్పాలన్నారు. వెంటనే పరిష్కరించేలా చూస్తామన్నారు. పోలీసు లందరం ఒక కుటుంబమని, సమన్వయంతో క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వర్తించాలన్నారు. రెండు నెలలకోసారి మెడికల్ క్యాంపు నిర్వహించి సిబ్బంది, అధికారులు, కుటుంబ సభ్యులకు హెల్త్ చెకప్ చేస్తామని చెప్పారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

తారుపల్లి పీజీ హెచ్ఎం సస్పెన్షన్

పెద్దపల్లి కమాన్, మార్చి 19 : కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం (పీజీ హెచ్ఎం) ఎం. శ్యామ్ సుందర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో మాధవి తెలిపారు. వీణవంక మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన శ్యామ్ సుందర్ రెడ్డి జమ్మికుంటలో నివాసం ఉంటూ ప్రైవేట్ చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. ఈ చిట్టీల వ్యాపారంలో మోసం చేశాడని బాధితుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, శ్యామ్ సుందర్‌రెడ్డిపై కేసు నమోదవడంతో, అతన్ని వరంగల్ ఆర్జేడీ సస్పెండ్ చేసినట్లు డీఈవో పేర్కొన్నారు.

క్వార్టర్ల కేటాయింపు కౌన్సెలింగ్

రామగిరి, మార్చి 19 : ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీకాలనీలో క్వార్టర్ల కేటాయింపు కొసం బుధవారం సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 174 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్మెంట్ చేంజ్ ఆఫ్ క్వార్టర్లకు 46 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. 25 మంది ఉద్యోగులు హాజరై 22 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం జి.రఘుపతి తెలియజేశారు. కార్యక్రమంలో డీపీఎం గుర్రం శ్రీహరి, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

ముత్తారం, మార్చి 19: ఖమ్మంపల్లిలో ట్రాక్టర్ యాజమానులకు మండల రెవెన్యూ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. ముత్తారం, అడవిశ్రీరాంపూర్ గ్రామాల్లోని రీచ్ లో మాత్రమే ఉచిత ఇసుక అనుమతులు ఉన్నాయని తెలిపారు. దీంతో పాటు మట్టి అవసరం ఉన్న వారు రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఇసుక తరలించాలని సూచించారు. ఆర్ఐలు శ్రీధర్, రాజాబాబు, కార్యదర్శి బద్రు, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

12కిలోల గంజాయి పట్టివేత

జ్యోతినగర్, మార్చి 19: ఎన్టీపీసీ మెటీరియల్ గేట్ వద్ద బుధవారం ఎస్ఐ ఉదయ్‌కిరణ్ వాహనాల తనిఖీ నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన మాల మల్లేశం వద్ద 12కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి గంజాయిని కొనుగోలు చేసిన గంజాయి విక్రేత తన కారులో కొత్తగూడెం, ములుగు, ఏటూరు నాగారం మీదుగా ఎన్టీపీసీకి విచ్చేసి ఎన్టీపీసీ లేబర్స్‌కు కొంత గంజాయిని అమ్మకాలు చేపట్టాడు. మిగితా గంజాయిని కరీంనగర్‌లోని తన ఇంటికి తీసుకు వెళ్తుండగా వాహన తనిఖీతో పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని, గంజాయి, కారును స్వాధీన పరుచుకోని కేసు విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 19: ఆర్జీ-2 ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో గల స్విమ్మింగ్‌పూల్‌ని ఎస్‌వోటుజీఎం ఎం రాముడు ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మరమ్మత్తులు పూర్తి చేసుకున్న స్విమ్మింగ్ పూల్‌ని బుధవారం ఎస్ఓటు జీఎం ప్రారంభించారు. ఉద్యోగులు, కుటుంబ సభ్యు లు స్విమ్మింగ్‌పూల్‌ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం(ప) అనిల్ కుమార్, డాక్టర్ మహిపాల్, క్రీడల సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంది రిజర్వాయర్ నీళ్లు తరలించొద్దు

- నందిమేడారం రైతుల ఆందోళన
- అధికారులు అప్రమత్తం
- వేంనూర్ పంప్‌హౌస్ రెండో మోటర్ ఆన్ చేసి జలాశయంలోకి నీటి తరలింపు

ఎల్లంపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ధర్మారం, మార్చి 19: పెద్దపల్లి జిల్లా నంది మేడారం రైతులు ఆందోళనకు దిగారు. నంది రిజర్వాయర్‌లో నీటిని సరిపడా నిల్వ ఉంచాలని, ఎగువకు తరలించవద్దని బుధవారం జలాశయం సమీపంలోని ఎల్లంపల్లి పంప్ హౌస్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గడం వల్ల తమ వరి పొలాలు ఎండిపోతున్నాయని వాపోయారు. తమ పంటలకు నీరందించకుండా ఎగువన కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని ఎలా పంపింగ్ చేస్తారని రైతులు ప్రశ్నించారు. తమకు అన్యాయం చేయవద్దని నినాదాలు చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో రైతులు ఫోన్‌లో మాట్లాడారు. వారు సముదాయించినా వినలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. అధికారులు అప్రమత్తమయ్యారు. వేంనూర్ పంప్‌హౌస్ నుంచి రిజర్వాయర్‌లోకి ఇదివరకే ఒక మోటర్ ద్వారా 247 క్యూసెక్కులు వస్తుండగా, రైతుల ఆందోళనతో రెండో మోటర్ ఆన్ చేసి మరో 247 క్యూసెక్కులు వదిలారు. ఎల్లంపల్లి బరాజ్ నుంచి మొత్తం 494 క్యూసెక్కులు నంది రిజర్వాయర్ లోకి వచ్చి చేరుతుండగా, ఇందులో నుంచి నారాయణపూర్‌కు 247 నీటిని ఒకే పైపులైన్ ద్వారా తరలిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు శాంతించారు.

నేషనల్ హైవే నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

వివరాలు తెలుసకుంటున్న కలెక్టర్

మంథని/మంథని రూరల్, మార్చి 19: వరంగల్- మంచిర్యాల గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బుష్ క్లియరెన్స్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. మంథని ప్రాంతంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం విస్తృతంగా పర్యటించారు. మంథని ఆర్డీవో కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, అడవిసోమనపల్లిలోనిర్మాణం అవుతున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడంతో పాటు ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. జాతీయ రహదారి ప్యాకేజీ-1లో భాగంగా మంథని మండలం పుట్టపాక వరకు ట్రెంచ్ కటింగ్ పనులు పూర్తి చేశామని తెలిపారు. బుషెస్ క్లియరెన్స్ పనులను వేగవంతం చేయాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేపట్టిన రేనోవేషన్ పనులను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి మంథని ప్రాంతానికి గైన కాలజిస్ట్‌ను కేటాయించామని, మంథని మాతా శిశు ఆసుపత్రిలో ఈ నెల 22 నుంచి ఈ సేవలు మరింత విస్తృతంగా అం దుబాటులో ఉంటాయన్నారు. మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మం జూరు పత్రాలు పంపిణీ చేసిన లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారురాలు మంజులతో ఇంటి నిర్మాణం పై కలెక్టర్ చర్చించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ యాప్‌లో నమోదు చేస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రతీ విద్యార్థికి తెలుగు ,ఆంగ్లం చదవడం రాయడం, కనీస గణిత సామర్థ్యం ఉండేలా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఆయన వెంట ఆర్డీవో సురేశ్, ఇంఛార్జి తహసిల్దార్ గిరి, మంథని మున్సిపల్ కమీషనర్ మనోహర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి , మార్చి19: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో 10వ తరగతి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే 10వ తరగతి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. సుమారు 7 వేల మంది విద్యార్థుల కోసం 41 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, తాగు నీరు అందించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది , ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మాస్ కాపీంగ్ జరగకుండా జాగ్రత్త వహించాలని, ప్రశ్న పత్రాల తరలింపుకు అవసరమైన పోలీసు భద్రత ఉండే విధంగా చూడాలన్నారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, సంబంధిత ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మ్యాన్ హోల్స్ సరిచేయండి

కోల్‌సిటీ, మార్చి 19: ప్రమాదకరంగా ఉన్న మ్యాన్ హోల్స్‌ను వెంటనే సరి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జే.అరుణ శ్రీ అధికారులను ఆదేశించారు. ఈమేరకు ఈనెల 17న నమస్తే తెలంగాణ దినపత్రికలో 33వ డివిజన్‌లో ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్ ఉండటంపై 'మ్యాన్ హోల్స్...డేంజర్ బెల్స్..' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అదనపు కలెక్టర్ అరుణ శ్రీ బుధవారం 33వ డివిజన్‌తోపాటు 11వ డివిజన్‌లో పర్యటించారు. ప్రమాదభరితంగా ఉన్న మ్యాన్ హోల్స్‌ను పరిశీలించారు. వెంటనే వాటిని సరి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రశాంత్‌నగర్‌లోని మల్కాపూర్ చెరువును ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చెరువు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ ఝాను కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆస్తి పన్ను వసూ ళ్ల అంశంపై చర్చించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఈఈ రామన్, అధికారులున్నారు

విద్యా సామగ్రి, టీషర్టుల పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, మార్చి19: మండలంలోని తారుపల్లి హైస్కూల్ లో గతంలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పని చేసిన పైడిపెల్లి చంద్రమోహన్ తారుపల్లి హైస్కూల్ లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు టీషర్టులు, విద్యా సామాగ్రి బుదవారం పంపిణీ చేశారు. చంద్రమోహన్ తారుపల్లి హైస్కూల్ లో గత 12 సంవత్సరాలుగా పని చేసి పాఠశాల అభివృద్ధి కి ఎంతగానో పని చేశారు. గతంలో విద్యార్థులతో ఉన్న అనుబందాన్ని గుర్తు చేస్తు విద్యా సామాగ్రి పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపిక

ప్రత్యూష

కమాన్‌పూర్, మార్చి 19: మండల కేంద్రానికి చెందిన బోధన ప్రత్యూష యాదవ్ సంక్షేమ శాఖ లో హాస్టల్ వార్డెన్ ఉద్యోగానికి ఎంపికైంది. బోధన గట్టయ్య, విజయలక్ష్మిలకు ముగ్గురు కుమార్తెలు. గట్టయ్య 2004లో మృతి చెందగా విజయలక్ష్మి కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషించారు. ఇద్దరు కుమార్తెలకు వివా హం కాగా చిన్న కుమార్తె ప్రత్యూష ఎంఏ (సోషి యాలజీ) చదివారు. 2022లో పీజీలో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారు. పేద కుటుం బం కావడంతో హైదరాబాద్‌లో స్నేహి తురాలి గదిలో ఉంటూ ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యారు. సంక్షేమ శాఖలో డబ్ల్యూహెచ్‌వో పోస్టుకు ఎంపికైంది.కాళేశ్వరం జోన్-1లో 74వ ర్యాంకు సాధించారు. రాష్ట్ర స్థాయిలో 738వ ర్యాంకు సాధించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తున్న సెయింట్‌క్లేయిర్ పాఠశాల

జ్యోతినగర్, మార్చి 19: ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేయిర్ పాఠశాల యాజమాన్యం రాష్ట్ర విద్యా శాఖ నిబంధనలను ఉల్లంఘించి ముందస్తుగా అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించింది. 2025-26 నూతన విద్యా సంవత్సరం ఆరంభానికి గడువు ఉన్నా పాఠశాల యాజమాన్యం మాత్రం ఇటీవల పాఠశాల నోటీసు బోర్డుపై అడ్మిషన్ నోటీసును జారీతో రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేశారు. బుధవారం ఏకంగా ఎల్‌కేజీకి అడ్మిషన్లు స్వీకరించారు. మిగితా తరగతుల అడ్మిషన్‌కు పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు కూడా చేపట్టారు. ఈ నెల 26వ తేదిన ఫలితాలు, 27న అడ్మిషన్‌లు స్వీకరిస్తామని పేర్కొంటున్నారు. ఈ ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని సెయింట్‌క్లేర్ పాఠశాల విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించి ప్రతి ఏడాది ముందస్తుగా అడ్మిషన్‌లు చెపట్టడం, ప్రవేశ పరీక్ష నిర్వహించడం సెయింట్‌క్లేర్ పాఠశాల యాజమాన్యంకు చెల్లుబాటుగా మారిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఈ పాఠశాల ఉల్లంఘన చర్యలు విద్యాశాఖ అధికారులకు కనబడకపోవడం గమన్హారం. ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు సెయింట్‌క్లేర్ పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ కవిత పోరాటం ఫలితమే బీసీ బిల్లు

కోల్‌సిటీ, మార్చి 19: విద్య, ఉద్యోగం, రాజకీయం వేర్వేరుగా విభజించి 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తెలంగాణ జాగృతి పోరాటం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పోరాటం ఫలితంగానే అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం లభించిందని జాగృతి నాయకులు తోట హరీశ్ గౌడ్, యువజన నాయకులు సాయికృష్ణ అన్నారు. ఈమేరకు బీసీ బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సందర్భంగా బుధవారం గోదావరిఖనిలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాల వేసి ఇందుకు కృషి చేసిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృ తి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత సారథ్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ కుల సంఘాల ప్రతినిధులను కలుపుకొని చేసిన ఉద్యమం ఫలించిందన్నారు. జాగృతి నాయకులు ముద్దసాని సృజన్‌కుమార్, సకినాల ప్రతాప్, బొడ్డు రమేష్, గుర్రం సాగర్ గౌడ్ పాల్గొన్నారు.

కదం తొక్కిన ఆశ కార్యకర్తలు

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆశ కార్యకర్తలు

పెద్దపల్లి టౌన్, మార్చి19: జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ బుధవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఎవరూ లోనికి వెళ్లకుండా అడ్డుకొని కలెక్టరేట్‌ను ముట్టడించారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అనుబంధ సంఘం తెలంగాణ ఆశ కార్యకర్తల యూనియన్ గౌరవ అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. అనంతరం ఆశ కార్యకర్తలు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఇక్కడ సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, అధ్యక్షురాలు శారద, నాయకులు సువర్ణ, రూపారాణి, హేమలత, రేణుక, శివలీల, మంజుల, స్వప్న, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వీకేపీ గని కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 19 : సింగరేణి సంస్థ ఆర్జీ-2 ఏరియా టీబీజీకెఎస్ వకీలుపల్లి గని పిట్ కమిటీని ఏరియా ఉపాధ్యాక్షుడు అయిలీ శ్రీనివాస్ ప్రకటించారు. బుధవారం నూతనంగా ఎన్నుకున్న పిట్ కమిటీని గని అధికారి నెహ్రూ, మేనేజర్ రవికిరణ్‌లకు పరిచయం చేసి పిట్ కమిటీ వివరాలను అందజేశారు. నూతన పిట్ సెక్రటరీగా సీహెచ్. వెంకటేశం, అసిస్టెంట్ సెక్రటరీగా ఎస్. శ్రావణ్, కోశాధికారిగా కే మనోజ్, సభ్యులుగా గంగాధర్, గౌరిశంకర్, ప్రశాంత్, అజయ్, సుజి త్ రెడ్డి, జీ రాంచరణ్, సాగర్, సతీశ్, వేణు, అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఆవుల రాములు, రాములు, ఖాసీం, వి.రాజారాం, బిక్షపతిని ఎన్నుకున్నారు.

కలెక్టర్‌కు వినతి

పెద్దపల్లి, మార్చి 19: మంథని సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన బొల్లంపల్లి సంతోష్ కుమార్‌గౌడ్ బుధవారం తెలిపారు. మంథని మండలం సూరయ్యపల్లికి చెందిన శ్రీ లక్ష్మి మోడరన్ రైస్ మిల్లు, ఆయిల్ మిల్ ఓనర్ ఓల్లాల సత్యనారాయణ, ఆయన కుటుంబ సభ్యులు డిఫాల్టర్స్‌గా ఉన్నారని, వీరి భూములు వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయకూడదని ఆదేశాలు ఉన్నాయని పేర్కకొనారు. మంథని సబ్ రిజిస్ట్రార్ వాటిని పట్టించుకోకుండా డిఫాల్టర్స్‌గా ఉన్న వారి భూములను వేరే వ్యక్తులు బదలాయించి ప్రభుత్వాన్ని మోసం చేశాడని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన అతనిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు.

ఏబీపీఎంకు జీతం చెల్లించాలి

జూలపల్లి, మార్చి 19 : తపాల శాఖలో పని చేసిన తాత్కాలిక ఏబీపీఎం అమరగాని శ్రీకాంత్‌గౌడ్‌కు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జూలపల్లి తహసీల్దార్ స్వర్ణకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు మేర్గు రమేశ్, నాడెం శ్రీధర్, కోరె శ్రీనివాస్, గడ్డం సంతోశ్, అమరగాని సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, Sri Mekala Mahesh S/o Late Mekala Madhuraiah Age: 32, occ: Business, H.No. 4-7/3, Gowreddipeta (V), Mandal & Dist Peddapalli, Acc sheet Roofed House No. 4-8 (Assessment No. 498) to an extent of 245.77 Sq.yards eq to 205.48 Sq.Meters, including Acc sheet Roofed House Plinth Area 415.71 Sq.Fts and AC Sheet Roofed Bath Room Plinth Area 22.36 Sq.Fts bounded by, లో కల ఈ హద్దులు.
North: open place of others
South: Way and House of Paleti Buchaiah
East: Open place of Paleti Rajaiah
West: House of Paleti Buchaiah & House of Mandala Sujan Reddy
కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.
ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.నావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా, Smt Kummari Buchamma w/o Narsaiah, Age: 56, occ: Business, H.No. 4-275/3, Raghavapur(V), Peddapalli Mandal & Dist, RCC, House bearing No. 4-275/3, admeasuring to an extent of 553.50 Sq.yards or 462.80 Sq.Mtrs, situated at Raghavapur Gramapanchayath Peddapalli Mandal & District Registration District Karimnagar & Sub-District Peddapalli having the following the boundaries:- లో కల ఈ హద్దులు.
East: Road
West: Open place of Kummari Madhuraiah
North: Open place of Kummari Narsaiah
South: Open place of Kummari Narsaiah
కల దానిని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనములో ఉండి నాక్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ పెద్దపల్లి వారి వద్ద తనఖా పెట్టుచున్నారు. కావున ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (7) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.
ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.నావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

రైతు గుర్తింపు కార్డుల జారీపై అవగాహన

ఓదెల, మార్చి 19: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు గుర్తింపు కార్డుల జారీపై కొలనూర్ రైతు వేదికలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి మాట్లాడారు. రైతులకు ఆధార్ కార్డు మాదిరిగానే రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్డుతో కేంద్ర ప్రభుత్వం భవిష్యత్‌లో ఏ సంక్షేమ పథ కం అమలు చేసిన ఉపయోగపడనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్రంలో ఐదు పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాల్లో ఒకటిగా ఓదెల మండలంలోని కొలనూర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను డీఏవో ప్రారంభించారు. ప్రతి రైతు ఆధార్ కార్డు, భూమి పట్టా పుస్తకం తీసుకుని రైతు వేదిక వద్దకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.సెల్ ఫోన్ కూడా తీసుకుని వచ్చి ఓటీపీ చెప్పాలన్నారు. ఇక్కడ ఏవో భాస్కర్, ఏఈవో రాకేశ్, పాల్గొన్నారు.

ఖనిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మించాలి

కోల్‌సిటీ, మార్చి 19: సింగరేణి సంస్థచే సెంట్రల్ లైబ్రరీ నిర్మించడంలో స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక పవర్‌హౌస్ కాలనీలో గల జిల్లా గ్రంథాలయంను బుధవారం సందర్శించారు. అక్కడ నిరుద్యోగ యువతతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వేలాది మంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతుంటారనీ, వారికి అన్ని వసతులతో కూడిన సెంట్రల్ లైబ్రరీ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఇక్కడి ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. కోచింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లడానికి ఎంతో వ్యయ, ప్రయాసాలతో కూడుకున్నదనీ, నిరుపేద యువకులు కోచింగ్ తీసుకునే స్తోమత లేక ఉద్యోగాలకు ఎంపిక కాలేక వయసు పైబడి నిరుద్యోగులుగా మిగులుతున్నారనీ, స్థానికంగా సెంట్రల్ లైబ్రరీ ఉండటం వల్ల ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దక్కేవన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి సీఎస్సార్ నిధులతో సెంట్రల్ లైబ్రరీ నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలనీ లేదంటే జీఎం కార్యాలయంను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో